క్లుప్తంగా

ఎన్నికల ప్రచారానికి రథాలు సిద్ధం



దేవరపల్లిలో సిద్ధమైన ప్రచార రథం

దేవరపల్లి: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతుండడంతో నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించడానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థులు కొత్త ప్రచార రథాలను సిద్ధం చేసుకుంటున్నారు. మాతో పాటు తమ రథం కూడా సిద్ధమని అభ్యర్థులు అంటున్నారు. గోపాలపురం ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గం ఇన్‌చార్జి తలారి వెంకట్రావు ఎన్నికల ప్రాచారానికి కొత్త రథం సిద్ధం చేసి దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాయలం వద్ద సిద్ధంగా ఉంచారు. కొత్తగా తయారు చేసిన ప్రచార రథాన్ని పలువురు పార్టీ నాయకులు పరిశీలించి వెళుతున్నారు.

నేడు తాత్కాలికంగా మంచినీటి సరఫరా నిలిపివేత

నిడదవోలు: పట్టణంలోని నెహ్రూనగర్ వాటర్ ట్యాంక్ నుంచి గణపతి సెంటర్ వరకూ మెయిన్ మంచినీటి పైప్‌లైన్ మరమ్మతు పనులు చేపట్టనున్న నేపథ్యంలో సోమవారం సాయంత్రం నుంచి మంచినీటి సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ కె. శ్రీనివాస్ తలిపారు. పట్టణంలో ఒకటో వార్డు నుంచి 16వ వార్డులు, 21, 22, 24, 25, 26, 27, 28 వార్డులకు మంచినీటి ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయడానికి చర్లయు తీసుకునట్లు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా వీరభద్రస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ

ఉండ్రాజవరం : వేలివెన్ను గ్రామంలో భద్రకాళీ సమేత వీరభద్ర స్వామివారి విగ్రహ పునఃప్రతిష్ఠ ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉయదం వేద పండితులు ఆధ్వర్యంలో పూజలు, హోమాలు చేసి అనంతరం స్వామివారి విగ్రహంతోపాటు విఘ్నేశ్వరుడు, వీనేశ్వర లింగం, నంది, గోగులమ్మ అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

కొవ్వూరు: పట్టణ శివారున ఏషియన్ పెయింట్స్ గోడౌన్ సమీపంలో హైవే పై ఆదివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వాహనం ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. వాహనం వ్యక్తి పై నుంచి వెళ్లడంతో శారీరం పూర్తిగా నుజ్జు నుజ్జు అయ్యింది. యాచకుడై ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. హైవే పెట్రోలింగ్ పోలీసు సహకారంతో ఆ మృతదేశాన్ని పట్టణ సీఐ వి.జగదీశ్వర రావు కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. సంఘటన స్థలంలో ఏవిధమైన ఆధారాలు లభ్యం కాలేదని సీఐ తెలిపారు.

గోదావరిలో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యం



కొవ్వూరు: ఔరంగబాద్ ఇసుక ర్యాంపు గేటు ఎదురుగా గోదావరి నదిలో ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి చేతిపై ఐ లవ్ యూ డాడీ, మోహన్ అని పచ్చబొట్టు ఉందని హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ బాబూరావు తెలిపారు. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుడి వద్ద ఏ విధమైన ఆధారాలు లభించలేదన్నారు. వివరాల కోసం పట్టణ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు. మృతుడి వయస్సు సుమారు 30 నుంచి 35 ఏళ్ల ఉంటుందన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కొవ్వూరు: పెనకనమెట్ట గ్రామంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న పసలపూడి సుబ్బారావును ఆదివారం అరెస్టు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాసరావు తెలిపారు. అతని నుంచి ఆరు క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

'రోటరీ' కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం

నిడదవోలు : రోటరీ అంతర్జాతీయ సంస్థ 119వ అవతరణ దినోత్సవాన్ని పురష్కరించుకుని స్థానిక రోటరీ ఆడిటోరియంలో క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. క్లబ్ సభ్యులందరూ ఆట పాటలతో రోజంతా ఆనందంగా గడిపారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ మాట్లాడుతూ సభ్యుల సహాయ సహకారాలతో సామాజిక సేవలను మరింత విస్తృపరచాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాసరావు, క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, గోపిరెడ్డి శ్రీనివాస్, గుంటుపల్లి శివకుమార్, కాళ్ల రాంబాబు, కొత్తపల్లి నాగేశ్వరరావు, పొన్నా సుబ్రహ్మణ్యం, గొన్నాబత్తుల రామారావు, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఎండీ షకిరా, శార్వాణి, సునీత, శారదా, రోటరీ, ఇన్నరవీల్, ఇంటరాక్ట్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో బీసీలకు ప్రాధాన్యం

- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత
- అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు



దేవరపల్లిలో శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి తానేటి వనిత

దేవరపల్లి: జగనన్న పాలనలో బీసీలకు గుర్తింపు నిచ్చి రాజ్యాధికారంలో ముందుపెట్టారని రాష్ట హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. దేవరపల్లి మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ఆదివారం ఆమె ప్రారంభోత్సవాలు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దేవరపల్లి, బందపురం, రామన్నపాలెం, ధుమంతునిగూడెం గ్రామాల్లో మంత్రి వనిత పర్యటించి గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, సిమెంట్ రోడ్లు, వ్యాపార దుకాణాల సముదాయం, కమ్యూనిటీ భవనాలు, ప్రహరీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి వనిత మాట్లాడుతూ బీసీలకు నామినేటెడ్ పదవులతో పాటు కేబినేట్‌లో రాజ్యాధికారంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందుపెట్టారన్నారు. బీసీలంటే బాక్‌వర్డ్ క్లాస్ కాదని, వైఎస్సార్ సీపీకి బ్యాక్‌బోన్ అని ఆమె పేర్కొన్నారు. కులవృత్తులు, మహిళలు, అగ్రవర్ణాల్లో వెనుకబడిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలబడిందని అన్నారు. మహిళలకు పెద్దపీట వేస్తూ ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో రకరకాల నాయకులు వస్తారని, ఎటువంటి ప్రలోబాలకు లొంగవద్దని ఆమె విజ్ఞప్తి చేశారు. 14 ఏళ్ల టీడీపీ పాలనలో మీ కుటుంబాల పరిస్థితి, ఐదేళ్ల జగనన్న పాలనలో పరిస్థితిని గమనించాలని ఆమె కోరారు. మరొక రెండు నెలల్లో జరగనున్న ఎన్నికల్లో జగనన్న తనను గోపాలపురం పించారని, ఆడబిడ్డగా అక్కున చేర్చుకుని గెలిపించాలని. పోలింగ్ సమయంలో రెండు ఓట్లు ఒకటి తనకు, మరొకటి ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌కు ఫ్యాన్ గుర్తుపై వేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచులు కడిమి వీరకుమారి, కూచిపూడి బుల్లారావు, శ్రీరంగం రామలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీరే దుర్గారావు, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, పార్టీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, మండల మహిళా కన్వీనర్ కె.హైమావతి, ఎంపీటీసీ సభ్యులు కామిశెట్టి శిరోమణి, పల్లికొండ రామలక్ష్మి, జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు మేడిబోయిన గంగరాజు, మండల యువజన విభాగం అధ్యక్షులు అనిశెట్టి సూర్యచంద్రరావు, మండల బూత్ కమిటీల కన్వీనర్ కుసులూరి వెంకటసతీష్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

పెరవలి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పేర్కొన్నారు. కొత్తపల్లి అగ్రహారంలో ఆదివారం రూ.15.60 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల కోసం కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు సమకూర్చటమే కాకుండా శంకుస్థాపన చేశామన్నారు. ప్రజలు ఏది కోరితే అది అందించే ప్రభుత్వం మన ప్రభుత్వమని దీనిని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. మన ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందని తెలిపారు. మరోసారి ఆశీర్వదిస్తే మరింత అబివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వీరమళ్ళ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు నక్కా పాలేశ్వరరావు, నాయకులు కోర్ల ఉదయ భాస్కరరావు, పిల్ల శ్రీనివాస్, పాలా వేంకటేశ్వరరావు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలంతా జగన్ వెంటే..



నిడదవోలు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

పార్టీ శ్రేణుల సమావేశంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: పేదవాళ్లకు పెత్తందార్లకు జరుగుతున్న యుద్ధంలో ప్రజలంతా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం జేకేఆర్, జేఆర్ఆర్ కల్యాణ మండపంలో మండల పార్టీ శ్రేణులతో సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ రానున్న రెండు నెలలు పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా పని చేసి వైఎస్సార్ సీపీ జెండాను మళ్లీ ఎగురవేయాలన్నారు. 57 నెలలలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడంతోపాటు ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేశామని, ఈ ప్రభుత్వ పాలనలో విప్లవాత్మక మార్పులను ప్రతి ఒక్కరూ చెప్పాలన్నారు. బూత్ కన్వీనర్లు మరింత క్రియశీలకంగా పని చేయాలని సూచించారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే పరిచయం చేశారు. గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా పని చేసి సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, గ్రామ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, నియోజకవర్గ బూత్ కన్వీనర్ గాజుల రంగారావు, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, పార్టీ రాష్ట్ర నాయకులు ముళ్లపూడి శ్రీనివాస్‌కుమార్ చౌదరి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మానుకొండ చంద్రబాబు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో ఉంటా

- ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు
- కొవ్వూరులో క్యాంపు కార్యాలయం ప్రారంభం



కొవ్వూరులో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి శ్రీనివాస్

కొవ్వూరు: పార్టీ కార్యకర్తలు, నాయకులకు నిరంతరం అందుబాటులో ఉంటానని, పార్టీ కోసం కష్టించి పని చేసే ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. ఆదివారం పట్టణంలో మెరకవీధిలో వినాయ కుడి వెనుక క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించారు. స్వార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని కోరారు. రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గం ఇన్‌చార్జి గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, వైస్ చైర్ పర్సన్ మన్నె పద్మ, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, ఎంపీపీలు మట్టా వీరాస్వామి, జొన్నకూటి పోసిరాజు, మండల పార్టీ అధ్యక్షులు సుంకర సత్యనారాయణ, కాకర్ల వెంకటేశ్వరరావు, చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు బండి పట్టాభిరామారావు, వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చొటుపల్లి వీరన్న, రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు గ్రామాల్లో ఎమ్మెల్యే పాదయాత్ర

కొవ్వూరు: ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు నియోజకవర్గంలో గ్రామాల వారీగా పాదయాత్ర చేపట్టనున్నట్టు గోపాలపురం ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు తెలిపారు. సోమవారం ఉదయం ఎనిమిది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు తాళ్లపూడి మండలం తాడిపూడి గ్రామంలో పాదయాత్ర చేయనున్నట్టు ఆయన తెలిపారు. మంగళవారం పట్టణంలో ఒకటి నుంచి నాలుగో వార్డు వరకూ ఈ పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. బుధవారం వేములూరు, పశివేదల గ్రామాల్లోను యాత్ర కొనసాగుతుందన్నారు. సార్వత్రిక ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమయత్తం చేయడంతో పాటు ప్రజా సమస్యలు తెలుసుకుంటూ వాటిని పరిష్కారించాలన్నదీ ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులు పాల్గొనాలని తెలిపారు.

రేపటి నుంచి భక్తాంజనేయస్వామి ఉత్సవాలు



నల్లాకులవారిపాలెంలో భక్తాంజనేయస్వామి

పెరవలి: నల్లాకులవారిపాలెంలో జాతీయ రహదారి పక్కన ఉన్న భక్తాంజనేయస్వామి ఉత్సవాలు మంగళవారం నుంచి 24వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, పౌరాణిక నాటకాలు, సినీ మ్యూజికల్ నైట్‌లు ఆలయ కమిటీ ఏర్పాటు చేసింది.

పటికబెల్లం స్వామి: భక్తాంజనేయస్వామి ఆలయానికి వచ్చే భక్తులు తమకు పుట్టబోయే బిడ్డ గురించి మొక్కులు మొక్కుకుంటారు. ఏ బిడ్డ కావాలో ఆ బిడ్డను ప్రసాదించిన స్వామివారికి ఆ బిడ్డ ఎత్తు పటికబెల్లంను భక్తులు సమర్పిస్తారు. ఉత్సవాలు జరిగే సమయంలో ప్రత్యేకంగా కాటాలను ఏర్పాటు చేసి చిన్నపిల్లలు, పెద్దలు నిలువెత్తు పటికబెల్లాన్ని తులా భారంగా ఇచ్చి మొక్కులను చెల్లించుకుంటారు. స్వామివారికి పటికబెల్లమే ఇష్టం కాబట్టి భక్తులు దీనిని సమర్పిస్తూ పటిక బెల్లం స్వామిగా కొలుస్తారు. గత 51ఏళ్లుగా స్వామివారి ఏకాహ ఉత్సవాలు కన్నుల పండువ నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచే కాక తూర్పు, కృష్ణ, గుంటూరు, విశాఖపట్నం జిల్లాల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని కొలుస్తారు.

చర్చిల్లో ఎమ్మెల్యే ప్రార్థనలు




చాగల్లులోని చర్చిలో ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే

చాగల్లు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించాలని, ముఖ్యమంత్రిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలని కోరుతూ ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు మండల కేంద్రం చాగల్లు, నెలటూరులోని ప్రార్థన మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక పెంతెకోస్తు, బైబిల్‌మిషన్ చర్చిల్లో విశ్వాసులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు జుట్టా కొండలరావు, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, సర్పంచ్ ఉన్నమట్ల మనశాంతి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

సుందరగిరిపై నరసన్న పెళ్లి సందడి

- భీష్మ ఏకాదశితో ఉత్సవాలు మొదలు
- 22న స్వామివారి కల్యాణం
- వేడుకలకు దాదాపు పూర్తయిన ఏర్పాట్లు



సుందరగిరిపై శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయం



గర్భాలయంలో కొలువైన లక్ష్మీనారసింహుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాథపురంలోని సుమనోహర సుందరగిరి పర్వతంపై ఉన్న శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. భీష్మ ఏకాదశి పర్వదినం మొదలుగా ఆరు రోజుల పాటు ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. అందులో భాగంగా శ్రీవారి దేవస్థానం అధికారులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం షామియానా, చలువ పందిళ్లు, ప్రత్యేక దర్శనం క్యూలైన్లను నిర్మించారు. అలాగే విద్యుద్దీపాలంకరణ పనులు పూర్తయ్యాయి. ఇదిలా ఉంటే ఆహ్లాదకర వాతావరణంలో, పురాణ ప్రాశస్త్యం గల ఈ ఆలయాన్ని దర్శిస్తే కోరిన కోర్కెలు తీరి, సకల శుభాలు కలుగుతాయనేది భక్తుల నమ్మకం. అందుకే ఏకాదశి వంటి పర్వదినాల్లో వేలాదిగా భక్తులు ఈ ఆలయాన్ని సందర్శిస్తుంటారు. చినవెంకన్న దేవస్థానం ప్రతి ఏటా స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలను అట్టహాసంగా నిర్వహిస్తోంది. ఇదిలా ఉంటే ఈ ఏడు ఉత్సవాలు జరిగే రోజుల్లో రాత్రి 7 గంటల నుంచి ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ఉత్సవ విశేషాలివీ..

- మంగళవారం ఉదయం 10.40 గంటలకు స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేస్తారు.
- 21న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు నిత్య పూజలు, హోమాలు, మూలమంత్ర హవనం, బలిహరణ, వేద పారాయణ, నిత్య హోమం, మండప పూజలు, హారతి తదితర పూజలు చేస్తారు.
- 22న ఉదయం 11.10 గంటల నుంచి స్వామివారి దివ్య కల్యాణం
- 23న సాయంత్రం 6.30 గంటల నుంచి స్వామివారి గ్రామోత్సవం
- 24న ఉదయం 8 గంటల నుంచి స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు, చందనోత్సవం, సాయంత్రం 7 గంటలకు ధ్వజావరోహణ పూజలు చేస్తారు
- 25న రాత్రి 7 గంటల నుంచి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్ప యాగోత్సవం

సాంస్కృతిక కార్యక్రమాలు

కూచిపూడి భరతనాట్య ప్రదర్శనలు, సత్యహరిశ్చంద్ర నాటకం, భక్తి రంజని, రామాంజనేయ యుద్ధం నాటకం, శ్రీ రత్నాలు పౌరాణిక నాటకం, మ్యూజికల్ పాటలు ఉంటాయి

క్షేత్ర విశిష్టత ఇదీ..

మతంగి మహర్షి తపస్సు ఫలితంగా సుందరగిరి పర్వతంపై శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారు స్వయంభూగా శాలిగ్రామ రూపంలో వెలిశారు. ఇప్పటికీ మతంగి మహర్షి సర్ప రూపంలో స్వామివారిని నిత్యం సేవిస్తారని ప్రసిద్ధి. ఆలయం వెనుక ఎన్నో ఏళ్లుగా చెక్కు చెదరకుండా ఉన్న పుట్టే ఇందుకు సాక్ష్యమని ఆలయ అర్చకులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఉగ్ర రూపంలో ఉన్న స్వామివారిని శాంతింప జేసేందుకు 1995లో తమిళనాడుకు చెందిన శ్రీధర్ గురూజీ, హైదరాబాద్‌కు చెందిన ఆయన ప్రధాన శిష్యులు కొచ్చెర్లకోట నరసింహ గురూజీ ఆలయ ఆవరణలో కనకవల్లీ దేవి అమ్మవారి విగ్రహాన్ని, అలాగే అష్ట దిక్కులలో 8 మండపాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ఏ ఆలయంలోను లేనటువంటి ఏకాక్షరి గణపతి, కాలభైరవుడు, సర్ప వెంకటేశ్వరుడు, చింతామణి గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, దత్తాత్రేయుడు, నవగ్రహాలు, ఆలయ క్షేత్రపాలకుడైన ఆంజనేయ స్వామివారు ఇక్కడ భక్తులకు దర్శనమిస్తున్నారు. ప్రతి ఏటా మహా శివరాత్రి పర్వదినం నాడు నరసింహ గురూజీ ఆధ్వర్యంలో మహా సుదర్శన యాగాన్ని ఘనంగా నిర్వహిస్తారు. అందులో పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొంటున్నారు.

అన్ని ఏర్పాట్లూ చేస్తున్నాం



నారసింహుని దివ్య కల్యాణ మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ వేడుకల్లో పాల్గొనే వీఐపీలతో పాటు సాధారణ భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. కొండ కింద కల్యాణ మండపంలో 22న స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. వేడుకల్లో అందరూ పాల్గొనవచ్చు.

– వేంద్ర త్రినాథరావు, శ్రీవారి దేవస్థానం ఈఓ

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గోపాలపురం: మహాత్మా జ్యోతీరావు పూలే ఏపీ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశానికి ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు గోపాలపురం బీసీ గురుకుల పాఠశాల కన్వీనర్, ప్రిన్సిపాల్ ఎంఎస్ సాయినాథ్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం(బాలికలు), కొవ్వూరు (బాలురు) రాజమండ్రి (బాలికలు), అనపర్తి(బాలురు) పాఠశాలలో ప్రవేశానికి 2024–25 విద్యాసంవత్సరానికి గానూ ఐదో తరగతి ఇంగ్లీషు మీడియంలోకి జిల్లా వారీగా పరీక్షల ద్వారా ఎంపిక చేయనుట్టు తెలిపారు. ప్రవేశానికి ఓసీ, బీసీ, ఈబీసీలకు చెందిన వారు 01-09-2013 నుంచి 31-08-2015 మధ్య పుట్టు ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన వారు 01-09-2011 నుంచి 31-08-2015 మధ్య పుట్టి ఉండాలని తెలిపారు. 2022 నుంచి 2024 విద్యా సంవత్సరాల్లో 3, 4 తరగతులు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదువుతూ ఉండాలమ. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష మించకూడదు. మార్చి 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. httpm:jpapbcwreir.apcfrr.in వెబ్‌సైట్‌లో లేదా ఏదైనా ఇంటర్నెట్ సెంటర్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసేకోవచ్చని సూచించారు.

అడ్డంకులను దాటి.. లక్ష్యాన్ని కొట్టి..

ఓ వైపు పేదరికం.. మరోవైపు కుటుంబ భారం.. ఇవేమీ అతడి లక్ష్యం ఎదుట అడ్డంకులు కాలేదు. జీవితంలో ఉన్నతంగా ఎదగాలన్న పట్టుదలతో.. అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్న కృతనిశ్చయంతో.. కఠోరంగా శ్రమించి ఇప్పటివరకూ గమ్యం వైపు పయనిస్తూనే ఉన్నాడు. జిల్లా, రాష్ట్ర స్థాయే కాదు.. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లోనూ తన అద్భుత ప్రతిభను ప్రదర్శించి, బహుమతులను సొంతం చేసుకున్నాడు. ఒలింపిక్ పతకమే తన లక్ష్యమంటున్న ఆ క్రీడాకారుడే.. నల్లజర్ల మండలం అనంతపల్లికి చెందిన గంటా దుర్గాశంకర్.



పతకాలు పొందిన దుర్గాశంకర్



దుర్గాశంకర్ సాధించిన పతకాలు, సర్టిఫికెట్లు, ఐడెంటిటీ కార్డులు

- కరాటేలో అద్భుత ప్రతిభ చూపుతున్న దుర్గాశంకర్
- అంతర్జాతీయ పోటీలోనూ స్వర్ణ పతకం

నల్లజర్ల: అనంతపల్లికి చెందిన గంటా దుర్గాశంకర్‌కు చిన్నప్పటి నుంచి క్రీడలంటే మక్కువ. తనకు ఎంతో ఇష్టమైన కరాటేపైనే దృష్టి సారించాడు. నల్లజర్ల ఎస్ఆర్‌కే కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతూనే.. రెండేళ్లుగా గౌరిపట్నంలోని అరిగెల గోపినాథ్ వద్ద శిక్షణ పొందాడు. 24 స్టెప్స్‌లోనూ ఉత్తీర్ణుడయ్యాడు. ఇంతవరకు జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్లలో పాల్గొని, 20 సర్టిఫికెట్లు, నాలుగు పతకాలు, రెండు ఐడెంటిటీ కార్డులు సాధించాడు.

ఒకవైపు చదువుతూనే మరోవైపు కరాటేలో శిక్షణ పొందాడు దుర్గాశంకర్. ఇతడి తండ్రి మల్లికార్జునరావు తాపీ పని చేస్తాడు. ఇటీవల మల్లికార్జునరావుకు యాక్సిడెంట్ కావడంతో, ప్రస్తుతం ఇంటికే పరిమితమయ్యాడు. ఈ క్రమంలో కుటుంబ భారమంతా దుర్గాశంకర్‌పై పడింది. దీంతో డిగ్రీ ప్రైవేటుగా చదువుతూ, ప్రస్తుతం తండ్రి తాపీ పనిని స్వీకరించి, కుటుంబానికి ఆధారంగా మారాడు. ఈ నెల 3, 4, 5 తేదీల్లో విశాఖలో స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఏడో అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొని, స్వర్ణ పతకం సాధించాడు. సినీ నటుడు సుమన్ చేతులమీదుగా ప్రశంసాపత్రం, స్వర్ణ పతకాన్ని అందుకున్నాడు.

ఒలింపిక్ పతకమే లక్ష్యం

కరాటే క్రీడ అంటే నాకు మక్కువ. జాతీయ, అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొన్నాను. బంగారు, కాంస్య, రజత పతకాలు కూడా సాధించాను. ఒలింపిక్ పోటీల్లో బంగారు పతకం సాధించాలన్నదే నా లక్ష్యం. ఆర్మీలో చేరి దేశానికి సేవ చేస్తా.

– గంటా దుర్గాశంకర్, కరాటే బ్లాక్ బెల్ట్, అనంతపల్లి